"మధురమైన పిల్లలూ - తండ్రికి మీ అవస్థ యొక్క సమాచారాన్ని హృదయపూర్వకముగా ఇవ్వండి, దాపరికము లేని సత్యమైన హృదయములోనే తండ్రి స్మృతి నిలవగలదు"

ప్రశ్న:- ఈ సమయంలో చిన్నా, పెద్దా అందరూ వానప్రస్థావస్థలో ఉన్నా కూడా మీరు ఏ మాటలను మీ నోటితో అనలేరు?

జవాబు:- బాబా, ఇప్పుడు ఇక త్వరగా చేయండి, ఇప్పుడు మనము ఇక ఇంటికి వెళ్దాము, ఇక్కడైతే చాలా దుఃఖము ఉంది. బాబా అంటారు - పిల్లలైన మీరు ఎప్పుడూ ఈ విధంగా అనకూడదు ఎందుకంటే మీరు ఇప్పుడు ఈశ్వరుని సమ్ముఖముగా కూర్చున్నారు. ఇప్పుడు మీకు శీతలమైన ఒడి లభించింది. ఈ సమయంలో మీరు ఉన్నతోన్నతులుగా అయ్యారు. సత్యయుగములో డిగ్రీ తగ్గిపోతుంది. అక్కడ దైవీ సంతానముగా అవుతారు, అంతేకానీ ఈశ్వరీయ సంతానముగా కాదు, అందుకే మీరు త్వరపడలేరు.

పాట:- నిన్ను పిలవాలని నా మనస్సు కోరుకుంటోంది... (తుమ్హారే భులానే కో జీ చాహ్తా హై...)

ఓం శాంతి. పిలిచేటువంటి మధురాతి-మధురమైన పిల్లలు ఇప్పుడు తెలుసుకున్నారు. భక్తులు భగవంతుడిని పిలుస్తారు. ఇప్పుడు మీరు భక్తులు కారు. మీరు పిల్లలు. పిల్లలైతే తలచుకుంటారు కూడా, అలాగే రాస్తారు కూడా - బాబా, మేము సమ్ముఖముగా వినాలని అనుకుంటున్నాము. బాబా, మీ ద్వారా సమ్ముఖముగా వినాలని ఉంది - అని నిమంత్రణను ఇస్తూ ఉంటారు. ఇప్పుడు బ్రహ్మా ముఖము లేకుండా డైరెక్టుగా వినడం కష్టము. బాబా కల్పపూర్వము వలె వచ్చి ఉన్నారని పిల్లలకు తెలుసు. బ్రహ్మాముఖవంశావళి బ్రాహ్మణ కులభూషణులు అన్న పేరు ఎంత బాగా ఇవ్వబడింది. బ్రహ్మాకుమార-కుమారీలు అయితే ఎంతోమంది ఉన్నారు. వారికి జ్ఞానం లభించింది. పరమపిత పరమాత్మ, ఎవరైతే జ్ఞానసాగరునిగా ఉన్నారో, వారినే సుఖసాగరుడు అని కూడా అంటారు. దుఃఖహర్త-సుఖకర్త అన్న గాయనము కూడా ఉంది, వారు శివబాబాయే. ఎన్ని భిన్న-భిన్న పేర్లను పెట్టారు. గాయనమైతే ఎంతగానో ఉంది కదా. హర హర అని గానం చేస్తారు, అనగా దుఃఖాలను హరించండి అని అర్థము. ఈ విధంగా భగవంతుని గురించే పాడుతారు. కానీ భగవంతుని గురించి తెలియని కారణముగా బ్రహ్మా, విష్ణు, శంకరుల విషయంలో - దేవ, దేవ మహాదేవా అని అంటారు. శివుడిని మరిచి శంకరుడిని హర హర మహాదేవా అని అంటారు. బ్రహ్మా మరియు విష్ణువును మహాదేవా అని అనరు. వారిరువురూ స్థూల పాత్రలోకి వస్తారు. శంకరుడు సూక్ష్మవతనములోనే ఉంటారు. దుఃఖాన్ని హరించే పతిత-పావనుడు ఒక్క నిరాకార భగవంతుడే. శంకరుడిని పతిత-పావనుడు అని అనరు. మహిమ అంతా ఒక్కరిదే. విష్ణువు యొక్క రెండు రూపాలు లక్ష్మీ-నారాయణులు లేక రాధే-కృష్ణులు, వారివురి జన్మ వేర్వేరుగా జరుగుతుంది. విష్ణువు అవతరణ అని కూడా గానం చేయబడింది. చతుర్భుజుడిని చూపిస్తారు. కానీ మొదట లక్ష్మీ-నారాయణులు స్వర్గములో యువరాజు, యువరాణి అయిన రాధే-కృష్ణులుగా అవుతారని ఎవరికీ తెలియదు. ఇది మీకే తెలుసు. మాయ యొక్క చాలా భారీ తుఫాను సూక్ష్మంగా వస్తుందని కూడా తెలుసు. మాయ మరిపింపజేస్తుంది. ఎన్నో తుఫానులు తీసుకువస్తుంది. ఏ విషయాన్ని అయినా దాపరికము లేని హృదయముతో పిల్లలు అడిగితే ఆ ప్రశ్నకు సమాధానం లభించగలదు. తుఫానులు కూడా అనేక రకాలుగా వస్తాయి. స్వప్నాలు, ఛీ-ఛీ వికల్పాలు, అనేక రకాలుగా వస్తాయి. గాలివానను తుఫాను అని అంటారు. ఇప్పుడు ఈ బ్రహ్మా అయితే ప్రసిద్ధమైనవారు. బాబా ప్రవేశించడంతో ఇంకా ఎంతో ప్రసిద్ధునిగా అయ్యారు. మనుష్యుల దేశం ఎలా ఉంటుందో, వారి వేషం కూడా ఆ విధంగా ఉంటుంది. ఇప్పుడు చూడండి, కొందరు కుంటివారిగా ఉంటారు, కొందరు నడుము వంగిపోయి ఉంటారు, కొందరికి నేత్రాలు ఉండవు. అక్కడైతే ప్రకృతిసిద్ధమైన సౌందర్యము ఉంటుంది. ఎందుకంటే పంచ తత్వాలు కూడా సతోప్రధానముగా ఉంటాయి. కావున ఈ జ్ఞానాన్ని సమ్ముఖముగా వినడానికి కుమార్తెలు పిలుస్తారు. పాటలలో కూడా ఎన్నో కొన్ని విషయాలు సరిగ్గానే ఉన్నాయి. ఏ విధముగా దేవతా ధర్మం కనుమరుగైపోయింది, కానీ స్మృతిచిహ్నాలైన మందిరాలు అయితే ఉన్నాయి కదా. స్మృతిచిహ్నాలు అన్ని ధర్మాలవారివి ఉన్నాయి. తప్పకుండా ఉన్నతోన్నతుడు అని ఒక్క నిరాకారుడైన భగవంతుడినే అంటారని పిల్లలైన మీరే అర్థం చేసుకుంటారు. వారి గాయనమే ఉంది. ఆత్మలు మరియు పరమాత్మ కలుసుకునేది కూడా సంగమయుగములోనే. ఆత్మలైతే ఎంతోమంది ఉన్నారు కదా. వృద్ధి జరుగుతూ ఉంటుంది. ఇప్పుడు పిల్లలైన మీరు సమ్ముఖముగా వింటున్నారు. ఇలా సమ్ముఖముగా వినాలని ఇతరులకు కూడా మనస్సు కలుగుతుంది. ఇక్కడకు రాలేరు. బంధనములో ఉన్నారు. వేరే

ఏ సత్సంగాలకు వెళ్ళడానికి ఎప్పుడూ ఎవరికి వద్దు అని చెప్పరు. బొంబాయిలో గీతను వినిపిస్తారు, అక్కడకు ఏ ధర్మం వారైనా వెళ్ళవచ్చు. ఫీజు ఉండదు. ఎక్కడి నుండి అయినా సహజ మార్గం లభిస్తుందేమోనని భిన్న-భిన్న గురువుల వద్దకు వెళ్తూ ఉంటారు. ముక్తి మరియు జీవన్ముక్తుల మార్గం గురించి ఎవ్వరికీ తెలియదు, అందుకే ఎంతగానో వెతుకుతూ ఉంటారు. ఇక్కడైతే గురువులు-పండితులు ఎవరూ లేరు. బ్రహ్మాకుమారులు మరియు కుమారీలు ఉన్నారు, అంతే. మహాత్ములు ఎవ్వరూ లేరు. మీరు ఏ విధముగా ఉన్నారో, అలాగే ఈ దాదా కూడా ఉన్నారు. తేడా ఏమీ లేదు. వస్త్రధారణ మొదలైనవాటిలో తేడా ఏమీ లేదు. ఈ శాలువా మొదలైనవాటిని కూడా అప్పుడప్పుడూ తీసేస్తాను. కానీ డ్రామానుసారంగా ఇది అఫిషియల్ డ్రస్ వంటిది. డ్రస్ ను అయితే చూడకూడదు. బుద్ధి శివబాబా వైపుకు వెళ్తుంది. మిగిలిన మనుష్యులందరూ శరీరాలను చూస్తారు. మీరు మీ శరీరాన్ని కూడా మర్చిపోతారు, అలాగే ఈ దాదా శరీరాన్ని కూడా మర్చిపోతారు. దేహీ-అభిమానులుగా అవ్వాలి. వీరి శరీరాన్ని స్మృతి చేయకూడదు. శివబాబా వీరి ద్వారా మనకు రాజయోగాన్ని నేర్పిస్తారు. వారే జ్ఞానసాగరుడు, త్రికాలదర్శి. వారే ఈ సమయంలో ఆదిమధ్యాంత రహస్యాలను కూర్చొని వినిపిస్తారు.

ఇది వృద్ధ మాతలు మొదలైనవారికి కూడా చాలా సహజము. ఆ స్కూళ్ళలోనైతే ఈ వృద్ధ మాతలు ఏమీ అర్థం చేసుకోలేరు. కానీ ఇది అందరి కోసమూ సహజమైనది. తండ్రి కేవలం - నన్ను స్మృతి చేయండి అని చెప్తారు. ఏ విధంగా మనుష్యులు మరణించే స్థితిలో ఉన్నప్పుడు - రామ, రామ అనమని లేక ఇంకేదో అనమని మంత్రాన్ని ఇస్తారు. చాలా వరకు వానప్రస్థము తర్వాతనే గురువు నుండి మంత్రాన్ని తీసుకుంటారు. కానీ ఇప్పుడైతే తండ్రి అంటారు - మొత్తం పాత ప్రపంచమంతటి వినాశనము జరుగనున్నది. ఇది వృద్ధులు, యువత, చిన్న పిల్లలు అందరి వానప్రస్థావస్థ. ఈ విధంగా ఇంకెవ్వరూ అనలేరు. మీరు అందరికీ మృత్యువును తీసుకువచ్చేందుకు తయారయ్యారా? అని అంటారు. అవును, మృత్యువైతే అందరిదీ జరిగేదే ఉంది. కొందరు అంటారు - బాబా, ఇక్కడ ఇంకా ఎప్పటివరకు ఉంటాము, మేము త్వరగా వెళ్ళిపోవాలి, ఇక్కడ చాలా దుఃఖము ఉంది. మున్ముందు కూడా ఈ విధంగా అంటారు. బాబా అంటారు, మీరు ఇలా ఎందుకు అంటారు. అరే, ఈ సమయంలో మీరు ఈశ్వరుని సమ్ముఖముగా ఉన్నారు, ఆ తర్వాత మీ డిగ్రీ తగ్గిపోతుంది, మీరు వెళ్ళి దైవీ సంతానముగా అవుతారు. ఇప్పుడు ఈ శీతలమైన ఒడి బాగుంది. అక్కడ (స్వర్గము) అయితే శీతలముగానే ఉంటుంది. కానీ ఇక్కడైతే వేడిగా ఉన్నవారిని కూడా శీతలముగా చేయడం జరుగుతుంది, కావున ఇది మంచిగా ఉంటుంది. ఇప్పుడు త్వరపడడం అనేది చేయకూడదు. ఇప్పుడు మనం ఉన్నతోన్నతముగా ఉన్నాము. మహిమ అంతా ఈ సమయానికి చెందినదే. దిల్వాడా మందిరము కూడా ఈ సమయానికి సంబంధించినదే. మొత్తం సృష్టిలోని ఆత్మలందరి మనసును తీసుకునేవారు తండ్రి. దిల్వాడా మందిరము అందరి కోసమూ ఉంది. ఆత్మ శరీరము ద్వారా పిలుస్తుంది - బాబా, రండి, వచ్చి మమ్మల్ని కొత్తగా తయారుచేయండి, మేము పాతబడిపోయాము. ఆత్మ మరియు శరీరము, రెండూ పాతబడిపోయాయి. ఆత్మ బుద్ధిహీనముగా, నేత్రహీనముగా అయిపోయింది. మనుష్యులను అంధులు అని అనరు. నేత్రాలైతే ఉన్నాయి కదా. కానీ బుద్ధి నేత్రహీనముగా ఉంది. ఆత్మలో స్మృతి చేయడానికి ఏ బుద్ధి అయితే ఉందో, అది పూర్తిగా మర్చిపోయింది. గోపికలు ఒక్కొక్కరూ ఒక్కో చోట నుండి పిలుస్తూ ఉంటారు. బంధనములో ఉన్న గోపికలు చిన్న-చిన్న పల్లెటూర్ల నుండి పిలుస్తూ ఉంటారు. తండ్రి అర్థం చేయిస్తారు, పిల్లలూ, సత్యయుగములో గృహస్థ ఆశ్రమము ఉండేది, పవిత్రముగా ఉండేవారు. ఇప్పుడైతే విషం కోసం ఎంతగా హైరానా పెడుతూ ఉంటారు. ఇక్కడ నిర్వికారులుగా తయారుచేయడం జరుగుతుంది అని అర్థం చేసుకోరు. నిర్వికారులుగా అయినట్లయితే తర్వాత ఏ విధంగా తయారవుతారు, అది కూడా తెలియదు. సన్యాసులు కూడా పవిత్రంగా అవ్వడం కోసం పారిపోతారు. కానీ, మనము పవిత్రముగా అయి పవిత్ర ప్రపంచములోకి వెళ్తామని వారికి తెలియదు. ఈ విషయాలను వారు ఒప్పుకోనే ఒప్పుకోరు. ఈ సమయములో ఎంత దుఃఖము ఉందంటే, దీని కన్నా ముక్తి లేక మోక్షము మంచిది అని భావిస్తారు. డ్రామాలో మోక్షము ఎవ్వరికీ లభించదని తండ్రి అర్థం చేయించారు. ఇప్పుడు మీకు తెలుసు. తండ్రి అంటారు - కేవలం ఇంత మాత్రమే గుర్తుంచుకోండి - 84 జన్మలు పూర్తయ్యాయి, ఇప్పుడు బాబా తీసుకువెళ్ళడానికి వచ్చారు. తండ్రిని స్మృతి చేయకపోతే తుఫానులు ఎన్నో వస్తాయి. నిరంతరం స్మృతి చేయడం చాలా కష్టమని వివేకము కూడా చెప్తుంది. బాబా అంటారు, మీరు కర్మయోగులు కానీ కర్మ చేసే సమయంలో స్మృతిని మర్చిపోతున్నారు, ఇది గమనించడం జరిగింది. ఇటువంటి అవస్థను పొందడానికి సమయం పడుతుంది. ఇందులో ఎంతో పురుషార్థము చేయవలసి ఉంటుంది. కాలేజీలో పురుషార్థీ పిల్లలకు రాత్రింబవళ్ళు చదువుకునే అభిరుచి ఉంటుంది. గవర్నమెంట్ నుండి స్కాలర్షిప్ తీసుకోవాలి అని ప్రయత్నిస్తారు. చాలా కష్టపడతారు. ఆ తర్వాత ఎంతో సంతోషిస్తారు. ఇక్కడ కూడా తండ్రి అంటారు - మీరు బాగా చదువుకొని స్కాలర్షిప్ తీసుకోండి. మొట్టమొదట సింహాసనాధికారులుగా అవ్వండి. పరుగు తీయాలి. తండ్రి ఇప్పుడు సమ్ముఖముగా కూర్చున్నారని మీకు తెలుసు.

వారు డైరెక్టుగా ఈ రథములో కూర్చొని పిల్లలూ, పిల్లలూ అని అంటూ మాట్లాడుతారు. బ్రహ్మ తనువైతే నిశ్చితము చేయబడింది. తండ్రి అంటారు, నేను ఆత్మలతో మాట్లాడుతాను. బాబా రండి - అని మీరు పిలిచేవారు, ఇప్పుడు నేను వచ్చాను. ఆత్మలైన మీరు కూడా నిరాకారులే. నేను కూడా నిరాకారుడినే. మీరు భక్తి మార్గంలో భిన్న-భిన్న నామ, రూప, దేశ, కాలాలను ధారణ చేసి తలచుకుంటూ వచ్చారు. ఇప్పుడు నేను సమ్ముఖముగా మీతో మాట్లాడుతున్నాను. మీకు మీ శరీరం యొక్క ఆధారము ఉంది. నేను దీనిని అద్దెకు తీసుకోవలసి ఉంటుంది. తండ్రి పిల్లలకు చెప్తున్నారు, ఇప్పుడు ఈ పాత శరీరాన్ని వదలాలి. నాటకము పూర్తి అవ్వనున్నది. ఇప్పుడు ఇక నిరంతరం తండ్రిని స్మృతి చేసేందుకు ప్రయత్నం చేయండి. ఒకవేళ ఇంకేదైనా గుర్తుకొస్తూ ఉంటే, శిక్షలను అనుభవించవలసి వస్తుంది. ఎంత వీలైతే అంత ఇతరుల స్మృతిని తొలగించివేయండి. యాత్రకు వెళ్ళినప్పుడు బుద్ధిలో అదే గుర్తుంటుంది. మేము శ్రీనాథ ద్వారానికి వెళ్తున్నాము, అంతే. మీది సత్యమైన ఆత్మిక యాత్ర. ఆత్మ పరమాత్మతో యోగము జోడిస్తుంది. మళ్ళీ శరీర నిర్వహణార్థము కర్మలు చేయడానికి ఇక్కడకు వస్తూ-వెళ్తూ ఉంటారు. ఎక్కడ ఉన్నా సరే స్మృతి ఉండాలి. భగవంతుడు సర్వవ్యాపి కాదు అని, వారు తండ్రి అని మరియు తండ్రి నుండి వారసత్వము లభిస్తుందని మీకు తెలుసు. సర్వవ్యాపి అని మాటకు అసలు అర్థమే వెలువడదు. తండ్రి వారసత్వాన్ని ఇవ్వవలసి ఉంటుంది. తండ్రికి - నాకు వారసత్వము లభించాలి అన్న ఆశ ఉండదు. నేను పిల్లలకు వారసత్వాన్ని ఇవ్వాలి అన్న ఆశ ఉంటుంది. ఈ తండ్రికి కూడా - నేను వారసత్వాన్ని ఇవ్వాలి అని హృదయంలో ఉంటుంది. తండ్రి మరియు పిల్లల సంబంధము ఉంది. పిల్లలు వారసత్వాన్ని తీసుకోవాలి, తండ్రి ఇవ్వాలి. అప్పుడు తండ్రి ఏమి తీసుకుంటారు! వారు ఇవ్వవలసి ఉంటుంది. సత్యమైన ఆత్మపై స్వామి సంతుష్టమవుతారు. కావున ఎంత సత్యవంతులుగా అవ్వాలి! కానీ, మీరందరూ పిల్లలే కదా, అందుకే వారసత్వాన్ని ఇచ్చే తండ్రిని స్మృతి చేయాలి. కచ్చా (అపరిపక్వులైన) పిల్లలకు స్మృతి ఉండదు. శరీర నిర్వహణార్థము కర్మలు చేయండి, తర్వాత తీరిక సమయంలో తండ్రిని స్మృతి చేయండి. మీ స్మృతి యాత్ర యొక్క రిజిస్టర్ మంచిగా అవుతూ ఉంటే సంతోషము ఉంటుంది. మనుష్యులకు ఏదైతే అలవాటు అవుతుందో, అది వృద్ధి చెందుతూ ఉంటుంది. బుద్ధిలో ఉండాలి - మా 84 జన్మలూ పూర్తయ్యాయి, ఇప్పుడు నాటకము పూర్తయ్యింది. ఇప్పుడు మనము మన ఇంటికి వెళ్తాము, అందుకే తండ్రి అంటారు - నన్ను స్మృతి చేయండి. గీతలో కూడా రెండు సార్లు మన్మనాభవ అని రాయబడి ఉంది. కొన్ని విషయాలు కేవలం పిండిలో ఉప్పు అంతే ఉన్నాయి.

ఇతర ధర్మాల వారికి ఎటువంటి చిత్రాలు మొదలైనవి ఉండవు. మీ చిత్రాలు ఉన్నాయి. అజ్మేర్ లో బ్రహ్మ చిత్రము కూడా ఉంది. బ్రాహ్మణులలో కూడా అనేక రకాల వారు ఉన్నారు. భిన్న-భిన్న పేర్లు పెట్టబడ్డాయి. భాషలు ఎన్ని ఉన్నాయో చూడండి. మన రాజధానిలో ఒకే భాష ఉంటుంది - అని పిల్లలకు తెలుసు. అక్కడి భాషయే వేరు, సంస్కృతము మొదలైనవి అక్కడ ఉండవు. కుమార్తెలు అక్కడి భాష మొదలైనవి వినిపించేవారు. ఇప్పుడు పిల్లలైన మీకు సంతోషము ఉండాలి - మనము మన రాజధానిని స్థాపన చేసుకుంటున్నాము, ఆ తర్వాత అక్కడ మన భాష ఉంటుంది. ఇక్కడి భాషలు అక్కడ ఉండవు. డ్రామాలో నిశ్చితమై ఉన్నదాని అనుసారంగా, మళ్ళీ మన మహళ్ళు మొదలైనవాటిని కల్పపూర్వము వలే తయారుచేసుకుంటాము. ఇక్కడ ఈ బ్రిటీష్ ప్రభుత్వము వారు కొత్త ఢిల్లీని తయారుచేసారు కదా. మనము ఢిల్లీ అన్న పేరును పెట్టుకోమని మీకు తెలుసు. ఈ పాత ప్రపంచమైతే అంతమవ్వనున్నది. మనకు పూర్తిగా కొత్త ప్రపంచము కావాలి. అక్కడ వజ్ర, వైఢూర్యాలతో పొదగబడిన మహళ్ళు తయారవుతాయి. ఇప్పుడు ఆ మహళ్ళు లేవు. మనం చాలా ఫస్ట్ క్లాస్ మహళ్ళను తయారుచేస్తామని బుద్ధి చెప్తుంది. ఇది ఛీ-ఛీ ప్రపంచము. పరస్పరం మీతో మీరు ఈ విధముగా మాట్లాడుకుంటూ ఉండాలి - అక్కయ్యగారూ, అన్నయ్యగారూ, ఇప్పుడు మనము ఇంటికి వెళ్తాము, మళ్ళీ వచ్చి మన రాజధానిని సంభాళిస్తాము, ఇటువంటి వస్త్రాలను ధరిస్తాము. ఇంతకుముందు నగలు మొదలైనవన్నీ స్వచ్ఛమైనవే ధరించేవారు. లక్ష్మీ-నారాయణుల మందిరంలో ఎన్ని నగలు మొదలైనవి ఉంటాయి. శివుని మందిరము ఎలా ఉంటుంది? శివుని లింగాన్ని కూడా వజ్రాలతో తయారుచేస్తారు. ఇవి కూడా అర్థం చేసుకోవలసిన విషయాలు. మన శివబాబా మందిరాన్ని తప్పకుండా ముసల్మానులే వచ్చి దోచుకున్నారు. దీనిని భక్తి మార్గం ప్రారంభంలో తయారుచేసారు. ద్వాపరయుగం నుండి శివబాబా మందిరాలు తయారు చేయబడ్డాయిని మీకు తెలుసు. తామే పూజ్యులు నుండి మళ్ళీ పూజారులుగా అవుతారు. మొట్టమొదట సోమనాథుని మందిరము తయారయ్యింది, సోమరసము అని జ్ఞానాన్ని అంటారు. జ్ఞానాన్ని ఇచ్చేవారు తండ్రి, వారి ద్వారా మీరు ధనవంతులుగా అవుతారు. తర్వాత అదే ధనముతో మీరు తండ్రి మందిరాలను తయారుచేస్తారు. పూజ కూడా జరుగుతుంది కదా. ఇంటి-ఇంటిలోనూ మందిరాలు నిర్మిస్తారు. ఎప్పుడైతే భక్తి మార్గం ప్రారంభమవుతుందో, అప్పుడు మనం పూజారులుగా అయి విగ్రహాలు మొదలైనవాటిని తయారుచేస్తాము అని మీకు తెలుసు. ఇప్పుడు మనం ఆ ప్రియుడైన పరమాత్మ నుండి వారసత్వాన్ని తీసుకునేందుకు వారికి ప్రేయసిగా

అయ్యామని పిల్లలైన మీకు తెలుసు. వాళ్ళు వికారాల కోసం ప్రేయసీ-ప్రియులుగా అవుతారు. కానీ ఇక్కడ ఆత్మ పరమాత్మ అయిన ప్రియునికి ప్రేయసిగా అవుతుంది. భక్తులందరూ వారిని తలచుకోవడాన్ని మీరు చూస్తారు. ఆ ప్రియుని మహిమ చాలా గొప్పగా ఉంటుంది. ఏ ప్రేయసులైతే పతితంగా అయిపోయారో, వారిని పావనముగా తయారుచేస్తారు. ఆత్మయే పతితముగా, ఆత్మయే పావనముగా అవుతుంది. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. స్కాలర్షిప్ తీసుకునేందుకు బాగా చదువుకోవాలి, సింహాసనాధికారులుగా అయ్యేందుకు పరుగుతీయాలి. కర్మలు చేస్తూ స్మృతిలో ఉండాలి.

2. మనము స్మృతి యాత్రలో ఉన్నాము, అందుకే ఇతరులందరి స్మృతిని బుద్ధి నుండి తొలగించి తండ్రి స్మృతిలో నిరంతరమూ ఉండాలి. స్మృతి రిజిస్టర్ ను సరిగ్గా ఉంచుకోవాలి.

వరదానము:- నిరంతర యోగులుగా మరియు పవిత్రులుగా అయి సర్వ వికారాలకు వీడ్కోలు చెప్పే శక్తి స్వరూప, పూజ్య స్వరూప భవ

తండ్రి ద్వారా పిల్లలందరికీ ముఖ్యంగా రెండు వరదానాలు ప్రాప్తిస్తాయి - ఒకటి, సదా యోగీ భవ, రెండవది, పవిత్ర భవ. ఎవరైతే ఈ వరదానాలను సదా జీవితంలో అనుభవం చేస్తారో, వారు 2-4 గంటల యోగులుగా అవ్వరు, కానీ నిరంతర యోగులుగా ఉంటారు. పవిత్రముగా కూడా అప్పుడప్పుడు కాక సదా పవిత్రంగా ఉంటారు మరియు సర్వ వికారాలకు వీడ్కోలు ఇచ్చేవారిగా ఉంటారు. ఒకోసారి క్రోధము లేక మోహము వచ్చేసాయి అన్నట్లు ఉండకూడదు. ఏ వికారమూ స్మృతి స్వరూపంగా అవ్వనివ్వదు. కావున ఇటువంటి యోగులే శక్తి స్వరూపులు మరియు సదా పవిత్రంగా ఉండే పూజ్య స్వరూపులు.

స్లోగన్:- సదా జ్ఞాన సూర్యుని సమ్ముఖంలో ఉన్నట్లయితే భాగ్యము రూపీ నీడ మీతోపాటు ఉంటుంది.